పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

- గన్నీల కొరత, లారీల రవాణా లేక ఇబ్బంది
- కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు
- ఉన్నతాధికారులు కేంద్రాలను తనిఖీ చేయాలని రైతన్న విజ్ఞప్తి


ఓదెలలో నిల్వ ఉన్న ధాన్యం రాశులు

ఓదెల: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. వరిని కోయించిన రైతులు వెంటవెంటనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. మూడు రోజులనుంచి తుపాన్ వార్తతో రైతులు బెంబేలెత్తుతున్నారు. రోజూ మొగులు పడటంతో వర్షం కురుస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేగవంతం చేయకపోవటంతో రైతులు నైరాశ్యం చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచుల కొరత ఏర్పడటంతో కాంటా పెట్టడంలో హమాలీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు తనిఖీ చేయాలి

మండలంలోని ఓదెల, కొలనూర్, గోపరపల్లె, ఉప్పరపల్లె, కనగర్తి గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభమైనా కొనుగోళ్లు వేగవంతం కాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు. కాంట పెట్టిన ధాన్యం లారీల రవాణా లేక నిల్వలు పేరుకుపోతున్నాయి. సెంటర్లలోని ధాన్యాన్ని కాంటా పెట్టి రవాణాను వేగవంతం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని కోరుతున్నారు.

కాంటా పెడ్తలేరు



ఓదెల మార్కెట్‌లోకి ధాన్యం తెచ్చిన . గన్నీసంచుల కొరతతో ఇప్పటికీ కాంటా పెట్టలేదు. వారం రోజుల నుంచి పడిగాపులు కాస్తున్నాం. ధాన్యం మాయిశ్చర్ వచ్చింది. అయినా కాంటా పెట్టకపోవటంతో చాలా ఇబ్బందిగా ఉంది.

– తూడి రాజేశ్వరి, రైతు, ఓదెల

మా గోస తీర్చాలి



ధాన్యం తెచ్చి పదిరోజులు అయినప్పటికీ కాంటా వేయలేదు. రాత్రిపూట చలిలో ధాన్యం దగ్గరే పడుకుంటున్నాను. రోజుకో సాకుతో ఇబ్బందులు పెడుతున్నారు. అధికారులు జల్దీ కాంటా పెట్టి మా గోస తీర్చాలి. ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి.

– రామినేని సమ్మయ్య, రైతు, ఓదెల

మబ్బులతో నిద్ర పడ్తలేదు



రోజూ వచ్చే మబ్బులతో నిద్రపడ్తలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతు న్నాయి. ఎప్పుడు వర్షం కురిసి ధాన్యం తడుస్తుందోనని రైతులంతా ఆందోళన పడుతున్నాం. ఐకేపీ సిబ్బంది తొందరగా కాంటాపెట్టి రైతుల ఇబ్బందులను తొలగించాలి. – బీరం నర్సయ్య రైతు, ఓదెల

వెలుగులు నింపే దీపావళి


అల్ఫోర్స్ హైస్కూల్‌లో దీపావళి ఉత్సవాలు

సుల్తానాబాద్: చీకటిని పారదోలుతూ జీవితాల్లో వెలుగులు నింపే పండుగ దీపావళి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి.నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి అన్నారు. నూతన వెలుగులు తీసుకొచ్చే గొప్ప పండుగను హిందూ సమాజంతో పాటు జైనులు, సిక్కులు ఆరోగ్యాన్ని, సంతోషాన్ని కోరుకుంటూ దీపావళి వేడుకలు జరుపుకుంటారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, విద్యార్థి దశలోనే పండుగల విశిష్టతను తెలిపేందుకు వేడుకల ప్రాముఖ్యత తెలిపామన్నారు. పండుగ రోజు ధనలక్ష్మి అమ్మవారి పూజ కేదారేశ్వర వ్రత నోములు జరుపుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దీపావళి నాటిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

బీఎస్పీ అభ్యర్థికి మహారాష్ట్ర ఉపాధ్యాయుల విరాళం


విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లిరూరల్: బీఎస్పీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉషకు మహారాష్ట్రలోని ఉపాధ్యాయులు విరాళం అందజేశారు. బహుజన రాజ్య స్థాపనకోసం ముందుకొచ్చిన పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి పోటీ చేయడం అభినందనీయమన్నారు. తమవంతుగా రూ.15వేలు విరాళంగా అందిస్తున్నామని మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఉద్‌గిర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు మాణిక్రం షిండే, జలక్ రాజ్ జివునే, మాధవ్‌కబడే తెలిపారు.

సృజనాత్మకత పెంచే కార్యక్రమాలు అభినందనీయం


ప్రదర్శన తిలకిస్తున్న ఎంఈవో సంపత్‌రావు

రామగిరి: చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలు కృష్ణవేణి యాజమాన్యం నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్‌రావు తెలిపారు. శుక్రవారం సాయిరాం గార్డెన్‌లో కృష్ణవేణి పాఠశాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌సీ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎంఈవో హాయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆలోచన విధానాన్ని సరైన మార్గంలో నడిపించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. సృజనాత్మకత, నైపుణ్యం పిల్లల భవిష్యత్‌ను ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులు చేసిన పలు కార్యక్రమాలను తిలకించారు. లెడ్ అకడిమిక్ మేనేజర్ ఐశ్వర్య, కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, రంజిత్ కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా మహా పడిపూజ


పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్పస్వామి ఉత్తర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం రాత్రి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి ఆధ్వర్యంలో రౌతు రమేశ్–జయశ్రీ దంపతులు మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రమదానం


శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో శశికళ సిబ్బంది

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట స్థలంలో పిచ్చిమొక్కలు పెరగడంతో పలు రకాల విష సర్పాలు వస్తున్నాయని సిబ్బంది అధికారులకు తెలిపారు. శుక్రవారం వెంటనే అధికారులు స్పందించి సిబ్బంది కలిసి శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు నరికివేశారు. పలురకాల చెత్తను శ్రమదానంతో శుభ్రం చేశారు. వివిధ రకాల పండ్ల మొక్కలను ప్రత్యేకంగా గుంతలు తీసి చెట్లకు రక్షణ కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఆఫీస్ సూపరింటెండెంట్ ఎండీ ఫరుఖోద్దీన్, సీనియర్ అసిస్టెంట్ బాబా సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి సహని సత్యం రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు తెలిపారు. స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో కొడిమ్యాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సత్యం ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు విద్యార్థిని అభినందించారు. స్పోర్ట్స్ మేనేజర్ సునీల్ కుమార్ ఉన్నారు.

యూనియన్ బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం


ఆవిర్భావ వేడుకల్లో సిబ్బంది

జూలపల్లి: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఆవరణలో బ్యాంకు 105వ అవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సురేశ్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు కూసుకుంట్ల రమాదేవి, అబ్బాపూర్ సర్పంచ్ ఈర్ల మల్లేశం, కుమ్మరికుంట ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం యాదవ్, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ తోటపద్మ సత్తయ్య, ఖాతాదారులు తొగరు శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘాల సీసీ మద్దెల జ్యోతి, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల ఆకస్మిక తనిఖీ


తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి రాజు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఉన్న పలు రకాల ఫర్టిలైజర్, విత్తనాల షాపులను మండల వ్యవసాయ అధికారి డేవిడ్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం పలు దుకాణాలను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం రిజిస్టర్లు, రికార్డులు సక్రమంగా రాస్తున్నారా.. లేదా అని పరిశీలించడంతోపాటు నిషేధిత మందులు అమ్ముతున్నారా అని పరిశీలించారు. యాసంగి సీజన్‌కు అవసరమైన పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని యాజమాన్యానికి సూచించారు. రికార్డులు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

పదోన్నతి పొందిన టీచర్లకు సన్మానం


సన్మానిస్తున్న ఎంఈవో సంపత్‌రావు

రామగుండం: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొంది అంతర్గాం మండలం నుంచి బదిలీపై వెళ్లిన ఇరుగురాల ఓదెలు, పద్మాదేవిని శుక్రవారం అంతర్గాం మండల విద్యావనరుల కేంద్రంలో సత్కరించారు. ఓదెలు అడవిశ్రీరాంపూర్ హైస్కూల్, పద్మాదేవి ముత్తారం హైస్కూల్‌కు బదిలీపై అయ్యారు. ఎంఈవో సంపత్‌రావు, పీఆర్‌టీయూ అంతర్గాం మండల అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, కార్యదర్శి కందుల సతీశ్‌కుమార్, టీచర్లు రవీందర్‌రావు, శ్రీనివాస్‌రావు, రాజమణి, లక్ష్మణ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మల్లయ్య, రాంచందర్, దశరథం పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం


సన్మానిస్తున్న ఎంఈవో రాజయ్య

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్‌లో పని చేసి ఓదెల మండలం కనగర్తి జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయిన హెచ్‌ఎం రమేశ్‌ను శుక్రవారం ఎంఆర్‌సీ భవన్‌లో సన్మానించారు. ఎంఈవో రాజయ్య, ఉపాధ్యాయులు నరెడ్ల సునీత, సత్యనారాయణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఓటర్ కార్డులు జారీ



పెద్దపల్లిరూరల్: జిల్లాలో కొత్తగా ఓటరుజాబితాలో పేరు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కొత్తగా నమోదైన 1,02,949 మంది ఓటర్ల గుర్తింపు కార్డులను ముద్రించాలని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. అందులో ఇప్పటి వరకు 72,753 ఓటరు గుర్తింపు కార్డులు అందాయని, వాటిని కార్డుదారుల చిరునామాలకు పోస్టల్‌శాఖ ద్వారా పంపిస్తున్నామని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తెలిపారు. కొంత మంది ఆ చిరునామాలో అందుబాటులో లేని కారణంగా తిరిగి వాపసు వచ్చాయన్నారు.

దళితుల్లో చైతన్యానికి కోటి సంతకాల సేకరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: దళితుల్లో చైతన్యం పెంచేందుకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సురేశ్ అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబర్ 4న నిర్వహించనున్న ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలన్నారు. రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. నాయకులు అశోక్, శ్రావణ్, నవీన్, రవీందర్, ప్రశాంత్ ఉన్నారు.

విద్యార్థులు అకౌంటింగ్‌పై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న విద్యార్థి

గోదావరిఖనిటౌన్: ప్రతీ విద్యార్థి అకౌంటింగ్‌పై పట్టు సాధించాలని, భవిష్యత్‌లో అన్ని రంగాలు అధికంగా అకౌంటింగ్‌పైనే ఆధారపడాల్సి వస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బీకాం కోర్సు చదివే విద్యార్థులకు కామర్స్ కోర్సు చదివితే కలిగే ఉపాధి అవకాశాల గురించి వివరించారు. అధ్యాపకులు రాజేశ్, సుబ్బారావు, వి.అంజనేయులు, ఎం.నరేశ్, ఎస్.అజయ్, కిరణ్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో మంథని రైతు నామినేషన్



మంథని: గజ్వేల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన దాసరి చంద్రమోహన్ నామినేషన్ వేశారు. చంద్రమోహన్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. కేసీఆర్ ఓటమి పాలైతేనే రాష్ట్రంలో రైతులకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: మురుగు కాలువల్లో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుధ్య కార్మికులు డ్రైనేజీల్లో పూడికతీతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయడంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోందని, ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని ఆయన సూచించారు.

గాయత్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ జూనియర్ కాలేజీలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేటి సమాజంలో విద్యార్థి బాధ్యత అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సురేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి

గోదావరిఖని: తిలక్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కె.విశ్వనాథ్, మాతంగి రాయమల్లు, ఈదునూరి రామకృష్ణ, రాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో తిలక్‌నగర్ చౌరస్తా



కోల్‌సిటీ: వాహనాల రాకపోకలతో నిత్యం బిజీగా ఉండే గోదావరిఖనిలోని తిలక్‌నగర్ చౌరస్తాలో చీకట్లు కమ్ముకున్నాయి. ఇటీవల తిలక్‌నగర్ చౌరస్తా జంక్షన్ అభివృద్ధి కోసం పనులు చేపట్టగా అక్కడి హైమాస్ట్ లైట్లను రామగుండం నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. దీంతో రాత్రివేళల్లో విధులకు హాజరయ్యే సింగరేణి కార్మికులతోపాటు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు వైపులా వీధిలైట్లు లేకపోవడంతో జంక్షన్ మూలమలుపులో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బల్దియా అధికారులు స్పందించి జంక్షన్‌లో లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కండె పోచం

రామగిరి: కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రత్నాపూర్ గ్రామానికి చెందిన కండె పోచం నియామకమయ్యారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా శుక్రవారం ఆయన నియామక పత్రం అందుకున్నారు.

✦ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా దాసరి మనోజ్

రామగిరి: కల్వచర్ల గ్రామానికి చెందిన దాసరి మనోజ్ యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శిగా నియామితులయ్యారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి శివ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులకు మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు.

✦ నూతన నియామకం

పాలకుర్తి: కాంగ్రెస్ పాలకుర్తి మండల అధికార ప్రతినిధిగా పాలకుర్తికి చెందిన తలారీ శంకర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా కన్నాల శాలపల్లి గ్రామానికి చెందిన అరుకల సతీశ్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య, కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య, నాయకులు నారాయణ పాల్గొన్నారు.

✦ గాయత్రీ కోఆపరేటివ్ బ్యాంక్‌శాఖ ప్రారంభం

గోదావరిఖనిటౌన్: గాయత్రీ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 27వ శాఖను శుక్రవారం పట్టణంలో రాష్ట్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.మదనగోపాలస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంకు అధ్యక్షుడు ముత్యాల లక్ష్మణ్, ఎస్‌బీఐ రీజియన్ హెడ్ అనూప్ ఆదర్శ్, సింగరేణి అధికారి ఎన్.సాంబయ్య, బ్రాంచ్ హెడ్ పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

✦ పెంచికల్‌పేటలో ఉచిత వైద్యశిబిరం

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో కరీంనగర్‌కు చెందిన రేనె ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేశ్, ఉపసర్పంచ్ లింగాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థుల స్టడీ టూర్


బ్రాహ్మణపల్లిలో అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: మల్లారెడ్డి విశ్వవిద్యాలయ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌కు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ డిగ్రీ విద్యార్థులు శుక్రవారం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో స్టడీ టూర్‌కు వచ్చారు. వరిపంట నూర్పిడి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గాండ్ల మల్లేశం, ఏఈవో శ్వేత, రైతులు పాల్గొన్నారు.